
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 35.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5



నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
బుధవారం 19 ఫిబ్రవరి 2025

## ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు

- 2004లో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు
- నిర్వహణా భారంతో 2008లో మూసివేత
- మూడేళ్ల క్రితం మళ్లీ మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి

7

# దంగల్

- సంప్రదాయ క్రీడా పోటీలకు నిలయంగా మారిన అయిజ మండలం
- వరాహాలు, శునకాలు, ఎద్దుల బండ లాగుడు, సందెరాళ్లు ఎత్తే పోటీలతో ప్రసిద్ధి
- జాతీయ స్థాయి మహిళా బాస్కెట్‌బాల్ పోటీలు కూడా..
- కర్ణాటక, రాయలసీమ సరిహద్దున ఉండటంతో మూడు ప్రాంతాల సంస్కృతికి నిలయం



కుస్తీ పోటీల్లో తలపడుతున్న బల భీములు(ఫైల్)

క్రికెట్.. కరాటే.. కుస్తీ.. వాలీబాల్.. కబడ్డీ.. ఇలాంటి పోటీల గురించి మనకు తెలుసు. కానీ మనుషులు కాకుండా జంతువులు తలపడే పోటీల గురించి మీరు విన్నారా?.. ఆద్యంతం ఆసక్తిగా ఉండే ఆ పోటీలను ఎలా నిర్వహిస్తారో మీరు చూశారా?.. చూడకుంటే జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో జరిగే తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లాల్సిందే. ఆ ఉత్సవాల సందర్భంగా వినూత్న పందేలను ఏటా ఏర్పాటు చేస్తున్నారు. రైతులతో సంబంధం కలిగిన పెంపుడు జంతువులైన పొట్టేళ్లు, వరాహా(పందులు)లు తలపడే పోటీలు, శునకా(కుక్క)ల పరుగు పందెం, ఒంటెద్దు బండ్ల గిరకలాగుడు పోటీలతో పాటు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్, సైకిల్, బైక్ స్లో రేస్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. కనుమరుగవుతున్న సంప్రదాయ క్రీడలను వెలుగులోకి తెస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు తరలొస్తున్నారు.

\- అయిజ, ఆంధ్రజ్యోతి

జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో జరిగే తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వినూత్న రైతు సనాతన సంప్రదాయ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ పెంపుడు జంతువుల పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణ, తుంగభద్ర నది మధ్యన ఉండి, నడిగడ్డగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయ ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని, పెంపుడు జంతువులను ప్రోత్సహించేందుకు ఇక్కడ పోటీలను నిర్వహిస్తున్నారు.

### కుస్తీ పోటీలు

బల భీములు కుస్తీ పోటీలలో పాల్గొనటానికి జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి వస్తుంటారు. గత 4 సంవత్సరాలుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇది ప్రాచీన సంప్రదాయ క్రీడ. ఈ పోటీలో ఇద్దరు వ్యక్తులు తలపడుతారు. ఎవరిది పైచేయి అయితే వారినే విజేతగా ఎంపిక చేస్తారు.

అయిజ పట్టణం కర్ణాటక, రాయలసీమ సరిహద్దున ఉండటంతో మూడు ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా మారింది. తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎద్దుల బండలాగుడు, కుస్తి, పొట్టేళ్ల, పందుల ఢీ, కుక్కల రన్నింగ్, ఒంటెద్దు బండ్ల గిరకలాగుడు తదితర పోటీలతో పాటు అయిజ మండలం ఉత్తనూర్ గ్రామంలో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతీయస్థాయి మహిళా బాస్కెట్ బాల్ పోటీలు, మండలంలోని పులికల్‌లో జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ జరిగే ప్రతీ పోటీ ఆకర్షణగా నిలుస్తోంది. అయిజలో సందెరాళ్లు, దుబ్బుడు గుండ్లు, ఇసుక బస్త ఎత్తు పోటీలు నిర్వహిస్తారు. పలకల పోటీలు, జడ కోలాటాలు సైతం ఏర్పాటు చేస్తారు.



### శునకాల పోటీలు

శునకా(కుక్క)ల పోటీలు గత 8 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొనటానికి 6 రాష్ట్రాల నుంచి కుక్కలు వస్తున్నాయి. పోటీల్లో పాల్గొనే కుక్కలను ఒక దాని పక్కన ఒకటి వరుసగా ఉంచుతారు. వాటికి ఎదురుగా కొద్ది దూరంలో కుందేలు బొమ్మ ఉంటుంది. బొమ్మకు కట్టిన తాడును అవతల నుంచి అతి వేగంగా చక్రం ద్వారా లాగుతారు. అదే సమయంలో ఎదురు చూస్తున్న కుక్కలు అది కుందేలు అనుకుని దానిని పట్టుకునేందుకు వేగంగా పరుగెడుతాయి. నిర్దేశించిన ప్రాంతానికి ముందుగా వెళ్లిన కుక్కను విజేతగా ప్రకటిస్తారు.

### వరాహాల పోటీలు

వరాహా(పందులు)ల పోటీలు 7 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సైతం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల నుంచి క్రీడాభిమానులు వస్తుంటారు. పందులలో ప్రధానంగా 2 రకాలు ఉంటాయన్నారు. ఒకటి ఫారం పంది. ఇది తవుడు, అన్నం మాత్రమే తింటుంది. మరొకటి నాటు పంది. ఇళ్ల మధ్య తిరిగే ఇది అన్నీ తింటుంది. ఫారం పందులను రూ.20 వేల నుంచి కొనుగోలు చేస్తారు. ఎరుకలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు పందుల పెంపకంలో భాగంగా తమ దగ్గర ఉన్న పందులను గమనించి, అందులో పోటీకి పనికొచ్చే దానిని గుర్తిస్తారు. ఏడాదిన్నర వయస్సు గల దానిని ఎంచుకుని, అదే వయసు గల పందితో పోటీకి వదులుతారు. అప్పటి నుంచి దానిని పోటీకి సిద్ధం చేస్తారు. వీటికి జొన్నలు, మొక్క జొన్నలతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తారు. ఉదయం, సాయంత్రం 2 నుండి 3 కిలో మీటర్లు వాకింగ్ చేయిస్తారు. పోటీ సమయంలో ఇతర వరాహంతో గొడవ పడేటప్పుడు ఆయాసం రాకుండా బలంగా తయారు చేస్తారు. ఈ పోటీలలో భాగంగా మైదానంలో రెండు పందులను వదులుతారు. రెండు

(మిగతా 6లో..)



కొల్లాపూర్‌లో ఈదమ్మ తల్లి షిడే ఉత్సవాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు

## వైభవంగా ఈదమ్మ షిడే..

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- జాతరలో దుకాణాల వద్ద సందడి

కొల్లాపూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోరికలు తీర్చే దేవతగా ప్రసిద్ధిగాంచిన కొల్లాపూర్ ఈదమ్మ అమ్మ వారి షిడే మహోత్సవం వైభవంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎల్లూరు దారిలో ఉన్న ఈదమ్మ దేవాలయం వద్ద మంగళవారం కొనసాగిన షిడే మహోత్సవం రైతు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి రైతులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల పై భారీ ఎత్తున తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి షిడే చివరన మేకపోతును కట్టి ప్రత్యేక పూజలు చేశారు. రైతులు వివిధ పార్టీల నేతలు ప్రజాప్రతినిధులు పూజలు నిర్వహించి షిడే మహోత్సవాన్ని ప్రారంభించారు. షిడేను దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మ వారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈదమ్మ తల్లి జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. షిడే మహోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మహేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల రమ్య, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు సింగిల్‌విండో డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల రైతులు షిడే మహోత్సవంలో పాల్గొన్నారు.



జాతరలో దుకాణాల వద్ద కిక్కిరిసిన జనం



ప్రత్యేక అలంకరణలో జములమ్మ అమ్మవారు

## జనసంద్రంగా జములమ్మ క్షేత్రం

- 60 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు
- పర్యవేక్షించిన ఆలయ చైర్మన్ వెంకట్రాములు

గద్వాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జములమ్మ ఆలయ పరిసరాలు మంగళవారం జనసంద్రంగా మారాయి. 60వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జములమ్మ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పుట్టింటి నుంచి అమ్మవారు వచ్చిన తర్వాత ఇది రెండో వారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున నుంచి భక్తులు క్యూ కడుతున్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య దంపతు లు, జిల్లా న్యాయాధికారులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోనే న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాలలో టెంట్లు వేసుకొన్నారు. చీర, రవిక, వెండి పాదాలు, కడియాలు బియ్యంతో నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు.



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

### భక్తుల సౌకర్యార్థం కూలర్లు

అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా సర్వదర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం కోసం రెండు క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఎండలు మండుతుండటంతో క్యూలైన్ల వద్ద కూలర్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో చలువ పందిళ్లు వేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ చైర్మన్, డైరెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్సైలు, 50 మందికి పైగా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అయితే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టాలని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు.

## కేజీబీవీల్లో ఆధిపత్యపోరు

- ఎస్‌వోలు, సీఆర్టీల మధ్య తరచూ వివాదాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

7

## స్పౌజ్ బదిలీపై విచారణకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

## చిరు వ్యాపారులకు సౌకర్యంగా వే సైడ్ మార్కెట్

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వే సైడ్ మార్కెట్ చిరువ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం పట్టణంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ.1.90 కోట్ల నిధులతో నిర్మిస్తున్న వే సైడ్ మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతనంగా నిర్మిస్తున్న వే సైడ్ మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వ్యాపారుల కోసం ప్లాట్‌ఫామ్, టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేశారని, మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, సింగిల్ విండో డైరెక్టర్లు క్యామ రాజు తదితరులు పాల్గొన్నారు.



వే సైడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

## చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

- నర్వలో వేడి నీరు మీద పడిన ఐదు నెలల చిన్నారి
- గోపాల్‌పేటలో పైకప్పు మీద నుంచి కింద పడి వ్యక్తి

7

## మారెమ్మ గుడిలో హుండీ చోరీ

## కేసుల పరిష్కారానికి గొప్ప అవకాశం

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ గొప్ప అవకాశమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత తెలిపారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయస్థాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజినీతో కలిసి ఆమె మాట్లాడారు. మార్చి 8వ తేదీన జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివాదాలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కోర్టులకు వెచ్చించే సమయం ఆదా చేసుకోవాడమే కాకుండా, కోర్టు ఫీజు కూడా వాపస్ తీసుకోవచ్చని తెలిపారు. కేసు ఒకసారి లోక్‌అదాలత్‌లో పరిష్కారమైతే అది శాశ్వతంగా పరిష్కరించినట్లేనని అన్నారు. గత డిసెంబరు 14న నిర్వహించిన లోక్ అదాలత్‌లో వనపర్తి జిల్లా కోర్టు అత్యధిక కేసులను పరిష్కారం చేసి రాష్ట్రంలో 22వ స్థానంలో నిలిచిందని తెలిపారు. మార్చి 8వ తేదీన మరిన్ని కేసుల పరిష్కారం ద్వారా వనపర్తి జిల్లా కోర్టు మెరుగైన స్థానంలో నిలుస్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్ సునీత



## పోటెత్తిన భక్తులు

- తిక్కవీరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు
- అయిజలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

7



## రూ.11కోట్ల ఎస్సీ కార్పొరేషన్ నిధులు వెనక్కి!

\- నేడు గద్వాలకు ఎస్సీ కార్పొరేషన్ జీఎం రాక - విచారణలో బహిర్గతం కానున్న విషయాలు

గద్వాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి, జీవనోపాధి కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ కార్పొరేషన్ పనితీరును పరిశీలించేందుకు బుధవారం కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఆనంద్‌బాబు గద్వాలకు రానున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.11కోట్లు ఆరు నెలల క్రితం వినియోగించుకోలేక వెనక్కి పంపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ కోసం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో దాదాపు వంద ఎకరాలకు పైగా భూ పంపిణీ చేశారు. మరో 100ఎకరాల భూమిని ఇచ్చేందుకు భూ యజమానులు అంగీకరించారు. మండలాల్లో తహసీల్దార్‌లు భూమికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి లబ్ధిదారులను కూడా ఎంపిక చేశారు. కానీ చివరలో భూ యజమానులు భూమి ఇవ్వడం రద్దు చేసుకున్నారని అందుకే ఇవ్వలేకపోయామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో భూమి విలువలు పెరగడం కూడ ఒక కారణం అంటున్నారు. భూ పంపిణీ కోసం గత ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఇతర జిల్లాలో దానిని పూర్తి చేశారని, గద్వాల జిల్లాలో అధికారుల అలసత్వంతో భూ పంపిణీ జరగలేదని దళితులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్‌లోని ఇతర పథకాలకు సంబంధించి గ్రౌండింగ్ పూర్తయిన రూ.5కోట్ల నిధులు వెనక్కి వెళ్లనున్నాయని దళితులు ఆరోపిస్తున్నారు. ఈ అంశాలన్నీ ఎస్సీ కార్పొరేషన్ జీఎం విచారణలో బహిర్గతం అయ్యే అవకాశం ఉంది.



తలపడుతున్న వరాహాలు(ఫైల్)



తలపడుతున్న పొట్టేళ్లు(ఫైల్)



బండను లాగుతున్న ఎద్దులు(ఫైల్)



సందెరాయి ఎత్తిన క్రీడాకారుడు(ఫైల్)

# దంగల్



ఒంటెద్దు బండ్ల గిరక పోటీలో తలపడుతున్న ఎద్దు(ఫైల్)

(5వ పేజీ తరువాయి)

కొట్లాడతాయి. తలపడకుండా పక్కకు తప్పుకుంటే ఆ వరాహం ఓడిపోయినట్టు. ఇలా పోటీలో అధిక పందులను ఓడించిన దాన్ని విజేతగా నిలుస్తుంది. ఈ సమయంలో ఏది గెలుస్తుందని పందెంలు వేసుకుంటారు.

### పొట్టేళ్ల ఢీ

అయిజలో పొట్టేళ్ల పోటీలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. 18 సంవత్సరాలుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీల్లో పాల్గొనటానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి క్రీడాభిమానులు తరలివస్తారు. పోటీల కోసం పొట్టేళ్లను ప్రత్యేకంగా పెంచుతారు. ఇందులో నాటు, కొండ(నెల్లూరు జుడిపి) జాతులు ఉన్నాయి. నాటు జాతి గొర్రె పొట్టేళ్లను పోటీకి తెస్తారు. వీటికి ఎండు ఖర్జూరం, బాదం, బెల్లం, జొన్నలు, మొక్కజొన్నలతో పాటు ప్రత్యేక దాన ఆహారంగా ఆసక్తి కలిగిన క్రీడాభిమానులు వీటికి 8 నెలల వయస్సు నుంచి పోటీలకు అవసరమైన శిక్షణ ఇస్తారు. వాకింగ్, స్విమ్మింగ్, అపుడప్పుడు పరిసరాలలో ఉన్న తమ పొట్టేళ్లతో ఢీ కొట్టించటం నేర్పిస్తారు. పోటీల సందర్భంగా రెండు పొట్టేళ్లను ఎదురెదురుగా వదులుతారు. పోటీ నుంచి తప్పుకుని వెళ్లిపోతే అది ఓడిపోయినట్లుగా గుర్తిస్తారు. పోటీని తట్టుకుని చివరి వరకు నిలిచిన దానినినే విజేతగా ప్రకటిస్తారు.



వరాహంతో పోటీదారు(ఫైల్)

### పశుబల ప్రదర్శన పోటీలు

అనాదిగా వస్తున్న సంప్రదాయ క్రీడ అయిన పశుబల ప్రదర్శన పోటీలు. ఈ పోటీల్లో నిర్దేశించిన బరువు గల బండను నిర్దేశించిన సమయంలో ఎక్కువ దూరం ఏ జత ఎద్దులు లాగుతాయో అవి మొదటి స్థానంలో నిలుస్తాయి. పోటీలకు ఒంగోలు జాతి పశువులను ఉపయోగిస్తారు. 4 పళ్ల గల ఎద్దులు, 6 పళ్ల గల ఎద్దులు, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తారు. ఎద్దు వయస్సును బట్టి బండ బరువును ఏర్పాటు చేస్తారు. ఒక ఎద్దును రూ. 25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కొనుగోలు చేస్తుంటారు.

### ముందు తరాలకు తెలియజెప్పేందుకు..

ఆసక్తి కలిగినవారు, పశుపోషకులు అయిజలో సంప్రదాయ క్రీడలను నిర్వహిస్తున్నారు. ముందు తరాల వారికి మన సంస్కృతి సంప్రదాయ విలువలను తెలియజేసేందుకు ఇక్కడ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. అయిజలో తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను దాదాపు 15 రోజుల పాటు నిర్వహిస్తారు. ప్రతీ రోజు ఒక క్రీడా పోటీలను నిర్వహిస్తారు. భక్తులకు భక్తి, ముక్తి, ఉల్లాసం, ఉత్సాహాన్ని నింపేలా ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 15న ప్రారంభమైన ఉత్సవాలు 28 వరకు కొనసాగనున్నాయి.

## బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి తొమ్మిది నామినేషన్లు



నారాయణపేట జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్న సీనియర్ నాయకుడు కొండయ్య

నారాయణపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్ష పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. అధ్యక్ష పదవికి ఏకంగా తొమ్మిదిమంది నామినేషన్లు దాఖలు చేయగా వారిలో కొందరు సీనియర్లు ఉండడం విశేషం. మక్తల్‌కు చెందిన బికొండయ్య, నారాయణపేటకు చెందిన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్, అధికార ప్రతినిధి రఘువీర్‌యాదవ్, సత్య రఘుపాల్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీశ్యాంసుందర్, కోటకొండకు చెందిన కెంచి శ్రీనివాస్, ఊట్కూర్‌కు చెందిన బాస్కర్, నర్వ మండలానికి చెందిన తిరుపతిరెడ్డి, గోవర్దన్‌గౌడ్‌లు జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు. ఒకేసారి తొమ్మిది మంది నామినేషన్లను దాఖలు చేయడంతో కమల కాషాయ దళంలో వేడి రాజుకుంది.

## వ్యక్తిపై పోలీసుల దాడి

- తల్లి స్కావెంజర్ డబ్బుల కోసం ఎంపీపీ కార్యాలయానికి వెళ్లిన కొడుకు
- అక్కడి నుంచి స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టిన పోలీసులు
- పోలీసుల తీరును నిరసిస్తూ మద్దూరులో ధర్నా

మద్దూర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు పిలిపించి ఓ వ్యక్తిని విచక్షణా రహితంగా పోలీసులు చితకబాదిన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తీరును నిరసిస్తూ బాధిత కుటుంబ సభ్యులు మద్దూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. బాధిత వ్యక్తి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొత్తపల్లి మండలంలో లల్లీపూర్ గ్రామానికి చెందిన ఎల్లప్ప భార్య అంజలమ్మ పది సంవత్సరాల నుంచి గ్రామ పాఠశాలలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తుండేది. అయితే మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో అత్త భీమమ్మ పాఠశాలలో స్వీపర్ విధులు కొనసాగిస్తూ వస్తోంది. ఇటీవలే పాఠశాలకు స్కావెంజర్ నిధులు విడుదలయ్యాయి. దాంతో భీమమ్మకు డబ్బులు ఇచ్చేందుకు గతంలో పాఠశాలలో విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయురాలు రూ.తొమ్మిది వేల వోచర్ అందించింది. ఆ డబ్బులు డ్రా చేసుకునేందుకు భీమమ్మ తన కొడుకు ఎల్లప్పతో కలిసి సంతకం కోసం పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ వద్దకు వెళ్లింది. చైర్మన్ సంతకం చేసేందుకు నిరాకరించడంతో తన తల్లికి రావల్సిన డబ్బుల కోసం కొడుకు సోమవారం కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీశాడు. అక్కడి నుంచి మధ్యాహ్నం పోలీసులు తనను స్టేషన్‌కు తీసుకెళ్లి ఏ కారణం లేకుండా కొట్టారని బాధితుడు తెలిపాడు. అక్కడినుంచి మళ్లీ కోస్గి పోలీస్‌స్టేషన్ తీసుకెళ్లి అక్కడా కొట్టాడని బాధితుడు ఎల్లప్ప తెలిపాడు. పోలీసుల తీరును నిరసిస్తూ మంగళవారం స్టేషన్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. ఆందోళనకు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు పలికారు. అకారణంగా కొట్టిన మద్దూర్ ఎస్‌ఐపై చర్యలు తీసుకోవడమే కాకుండా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోస్గి సీఐ సైదులు, ఎస్‌ఐ బాల్‌రాజ్ మద్దూర్‌కు చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. తన కొడుకును అకారణంగా చితకబాదిన మద్దూర్ ఎస్‌ఐ విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడి తల్లి భీమమ్మ సీఐ సైదులుకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై సంఘటనపై సీఐ సైదులును వివరణ కోరగా ఎల్లప్పపై వచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు పిలిపించి విచారించడం జరిగిందన్నారు. ఇటు బాధిత ఎల్లప్పపై అందిన, అటు ఎస్‌ఐపై ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



పోలీసుల దాడిలో గాయపడ్డ ఎల్లప్పను చూపుతున్న కుటుంబ సభ్యులు

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఏడీఆర్ డాక్టర్ సి.సుధాకర్



పీజేటీఏయూ అంతర పాలిటెక్నిక్ క్రీడా సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సి.సుధాకర్

బిజినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సి.సుధాకర్ సూచించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు సిద్ధిపేట జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ (పీజేటీఏయూ) అంతర పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో ప్రతిభ కనబర్చి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులను గురువారం మండలంలోని పాలెం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో అభినందించి మాట్లాడారు. విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలంటే మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. నిత్యం క్రీడలు, ఆటలు ఆడడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అలాగే సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో పాల్గొనడం ద్వారా కళలపై అభిరుచి, ఎన్నో కొత్త విషయాల పట్ల, భాష జ్ఞానం పెంపొందుతుందన్నారు. వివిధ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి, డాక్టర్ కె.శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.బాలరాజు యాదవ్, పార్వతి, అభిలాష్ రెడ్డి ఉన్నారు.

## నేడు సొంత ఊరికి సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ రాక

తాడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ బుధవారం తన సొంత ఊరైన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామానికి రానున్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు నాగ్ అశ్విన్ హాజరవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నాగ్ అశ్విన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ హాజరు కానున్నారు. ఉదయం 9గంటల సమయంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ చేయనున్నారు.



దర్శకుడు నాగ్ అశ్విన్

## మహిళపై రాళ్లతో దాడి : కేసు నమోదు

పాన్‌గల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మహిళపై రాళ్లతో దాడి చేసిన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మండల పరిధిలోని దావూద్ ఖాన్‌పల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జములమ్మ కాలకృత్యాలు తీర్చుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా... అదే గ్రామానికి చెందిన కొంకల సహదేవుడు పాత కక్షలు మనసులో పెట్టుకుని రాళ్లతో దాడి చేశాడని ఫిర్యాదు చేయగా... ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## చాటింగ్‌లతో మోసపోతున్న యువత

- షీ టీం అవగాహన సదస్సులో ఏఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అంటూ మొబైల్లో చాటింగ్ చేస్తూ కొత్త పరిచయాలతో యువకులు మోసపోతున్నారని అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో అడిషనల్ ఎస్పీ మాట్లాడారు. విద్యార్థులు సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత సామాజిక సమస్యలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదని అన్నారు. ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. దినపత్రికలు చదివి సామాజిక అంశాలపై చర్చించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మొబైల్ వాడకం వలన వచ్చే సమస్యలను విద్యార్థులకు చెప్పాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణంలో అమ్మాయిలు, మహిళలు టీసేఫ్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తప్పక ఆ యాప్‌ను ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వేధింపులకు గురైనప్పుడు షీటీంను సంప్రదించి ఫిర్యాదు చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచి ఆకతాయిల ఆట కట్టించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రధాన కూడలిలో చౌరస్తాలో మండల జిల్లా కేంద్రాల్లో షీటీం పని చేస్తుందని, బాధితులు 100లేదా 8712657676 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలపాలని షీ టీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో షీటీం బృందం వెంకటయ్య, స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రామేశ్వర్

## ప్రశాంత వాతావరణంలో శివాజీ శోభాయాత్ర జరుపుకోవాలి

- ఎస్పీరావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించే శివాజీ జయంతి శోభాయాత్రలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో హిందూ వాహిని నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇతర మతస్తులను గౌరవిస్తూ.. తమ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు తమ ఐక్యతను చాటుకోవాలని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. పోలీసులు అవసరం అనుకున్న ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ.., ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామని అందుకు ప్రజలంతా పోలీసు వారికి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. ఊరేగింపులో భాగంగా సాంప్రదాయ జానపద నృత్య ప్రదర్శనలు జరుపుకోవచ్చన్నారు. ఎవరి మనోభావాలకు వ్యతిరేకంగా ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించకూడదని సూచించారు. ధ్వని కాలుష్యాన్ని పెంచే డీజే సౌండ్ సిస్టమ్స్‌ను ఉపయోగించకూడదని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్, వనపర్తి జిల్లా హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్‌గౌడ్, వనపర్తి జిల్లాలోని కొత్తకోట, ఆత్మకూరు, పెబ్బేరు, శ్రీరంగాపూర్ హిందూ వాహిని మండల అధ్యక్షులు హిందూ వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్



ఫర్నిచర్ గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

## ఫర్నిచర్ గోదాం దగ్ధం

వనపర్తి క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూ బాలాజీ నగర్ కాలనీ బీటీసీ స్టేడియం సమీపంలోని ఓ ఫర్నిచర్ గోదాంలో మంగళవారం రాత్రి 10 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. ఫర్నీచర్ గోదాంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి భారీగా ఎగిసిపడుతున్నాయి. స్థానికులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. గోదాంలో పూర్తిగా ఫర్నిచర్ దగ్ధం కావడంతో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పరిమళించిన మానవత్వం

- యువకుడికి ప్లేట్లెట్స్ ఇచ్చి ప్రాణం పోసిన వెంకటేశ్



నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్లేట్లెట్ దానం చేస్తున్న యువకుడు వెంకటేశ్

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల గ్రామానికి చెందిన యువకుడు భానుప్రకాశ్ అనారోగ్యంతో నాగర్‌కర్నూల్ జిల్లా గవర్నమెంట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఆ యువకుడిని పరీక్షించిన వైద్యులు వెంటనే అతనికి బీ పాజిటివ్ ప్లేట్లెట్స్ ఎక్కించాలని, లేకపోతే ప్రాణాపాయం అని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో ప్లేట్లెట్స్ ఎక్కడా దొరకకపోవడంతో యువశక్తి ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. జీవితం చాలా చిన్నదని, బతికిన నాలుగు రోజులు సాటి మనిషికి ఆపద వచ్చినప్పుడు మనం సహాయం చేయాలన్న దృక్పథంతో బ్లడ్ బ్యాంక్‌లో రక్తం దొరకక తిప్పలుపడ్డారు. సాటి మానవ శరీరంలో మాత్రమే ఉత్పత్తి అయ్యే సహజ ప్రక్రియ కాబట్టి మానవతా హృదయంతో రోగి భానుప్రకాశ్‌కు ప్లేట్లెట్స్ దానం చేయడానికి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్ అనే యువకుడు ముందుకు వచ్చి మంగళవారం ప్లేట్లెట్స్ దానంచేశారు. నాగర్ కర్నూల్ జిల్లా యువశక్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్ మహేందర్, కుటుంబ సభ్యులు వెంకటేశ్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, యువశక్తి ఫౌండేషన్ సభ్యులు ల్యాబ్ టెక్నీషియన్లు బసంత్ పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

చారకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమని, నేరాలు నియంత్రించడం, ఛేదించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంలో వ్యాపారస్తులు, నాయకుల సహకారంతో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను మంగళవారం ఎస్పీ వైభవ్ గైక్వాడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు, నాయకులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా నేరాలు, దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. అనంతరం యువకులకు రోడ్డు సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐలు శంషుద్దీన్, కురుమూర్తి, మాధవరెడ్డి, కృష్ణదేవ, నాయకులు వెంకట్‌గౌడ్, బాలరాంగౌడ్ ఉన్నారు.

## జూడో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామ్‌లక్ష్మణ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జూడో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యాయామ సంచాలకుడు డాక్టర్ రామ్‌లక్ష్మణ్ ఎన్నికైయ్యారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో మంగళవారం నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా ఇండియా జూడో సంఘం నుంచి జయరాజ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రతినిధి మహేశ్‌కుమార్ వ్యవహరించారు.



డాక్టర్ రామలక్ష్మణ్

క్రైం కార్నర్

## చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

» నర్వలో వేడి నీరు మీద పడిన ఐదు నెలల చిన్నారి

» గోపాల్‌పేటలో పైకప్పు మీద నుంచి కింద పడి వ్యక్తి



తనుశ్రీ (ఫైల్)

నర్వ/ గోపాల్‌పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ఘటనల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వారిలో ఐదునెలల చిన్నారి ఉంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రానికి చెందిన మనీష, రాజేశ్ దంపతులకు ఐదు నెలల చిన్నారి తనుశ్రీ ఉంది. నెల రోజుల క్రితమే చిన్నారికి నామకరణం చేశారు. ఐదు రోజుల క్రితం మనీష కుమార్తెను ఎత్తుకొని, మరో చేతిలో వేడి నీరున్న బకెట్‌తో స్నానాల గదికి వెళ్తుండగా జారిపడింది. దీంతో వేడి నీరు మీద పడి తల్లీ బిడ్డలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన పసిపాపను వెంటనే చికిత్స కోసం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. చికిత్స కోసం దాదాపు రూ. 2.5 లక్షలు అప్పు చేసి, ఖర్చు పెట్టినా, పసిపాప ప్రాణం దక్కలేదని తల్లిదండ్రులు విలపిస్తూ తెలిపారు.

**పైకప్పు మీద నుంచి పడి..**

వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండల కేంద్రనికి చెందిన తుర్కదిన్నె యాదగిరి (40) అనే వ్యక్తి బస్‌స్టాప్ పక్కన నూతనంగా దుకాణం నిర్మించుకున్నాడు. ఆదివారం సాయంత్రం దుకాణం పైకప్పు మీద ఉన్న ఇసుకను తట్టలో నింపుకొని కిందకు వస్తుండగా, జారి కిందపడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు అతడిని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు.

**సెంట్రింగ్ పని చేస్తుండగా..**

నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం మహదేవునిపేట గ్రామానికి చెందిన శ్రీను మంగళవారం గోపాల్‌పేటలో ఎస్‌బీఐ ముందు సెంట్రింగ్ పని చేస్తూ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని ఆటోలో వనపర్తికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంలో హైదరాబాద్‌కు తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తోటి పనివారు తెలిపారు.

## 30 పందుల అపహరణ

» యజమానులపై రాళ్లతో దాడి

ఆత్మకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దుండగులు 30 పందులను అపహరించారు. వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని పరమేశ్వరస్వామి చెరువు కట్ట బ్రిడ్జి వద్ద సోమవారం అర్ధరాత్రి తర్వాత ఈ సంఘటన జరిగింది. ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణానికి చెందిన చెన్నయ్య, పరశురాములు చెరువు కట్ట బ్రిడ్జి కింద స్థావరాలను ఏర్పాటు చేసుకుని పందుల మేపుకుంటున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో గుర్తు తెలియని దుండగులు వారిపై రాళ్లతో దాడి చేశారు. 30 పందులను అపహరించి, నెంబర్ ప్లేట్ లేని బొలెరో వాహనంలో తీసుకెళ్లారు. దీంతో బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్, ఎస్ఐ నరేందర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విచారణ చేపట్టి దుండగులను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

## రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



సంఘటనా స్థలంలో బాధితుడితో మాట్లాడుతున్న ఎస్ఐ

మిడ్జిల్, ఫిబ్రవరి 18 : (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రం సమీపంలో 167వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం, బీదర్‌కు చెందిన శంకర్ జడ్చర్లలో పానీపూరి వ్యాపారం చేస్తూ జీవనం గడుపుతున్నాడు. మంగళవారం ఆయన కల్వకుర్తి నుంచి జడ్చర్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అలాగే రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీను ద్విచక్రవాహనంపై భార్య పద్మ, కుమార్తెతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం మాదారం గ్రామంలో పెళ్లికి హాజరై తిరిగి వస్తున్నాడు. మిడ్జిల్ శివారులోని పాత కాటన్‌మిల్ సమీపంలో ముందు వెళ్తున్న శంకర్ వాహనానికి సడన్ బ్రేకు వేయడంతో, వెనుకనే వస్తున్న శ్రీను వాహనం దాన్ని ఢీకొన్నది. ప్రమాదంలో శంకర్, శ్రీనులకు తీవ్ర గాయాలయ్యాయి. పద్మతో పాటు, ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన శంకర్, శ్రీనులను 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మారెమ్మ గుడిలో హుండీ చోరీ



పొలంలో పడి ఉన్న హుండీ

అయిజ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని భైనపల్లి గ్రామంలో గల మారెమ్మ గుడిలో హుండీ చోరీకి గురయ్యింది. మంగళవారం ఉదయం పంట పొలంలో హుండీ పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఎస్ఐ శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని హుండీని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గత ఏడాదిగా హుండీని లెక్కించలేదని, అందులో నగదుతో పాటు వెండి, బంగారం మొత్తంగా కలిపి లక్ష రూపా యల వరకు ఉండొచ్చని వారు ఆయనకు వివరించారు. సంఘటనపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

## ‘తక్‌పట్టి’తోనే ఎంఎస్‌పీ కార్యకలాపాలు

పాలమూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు చెందిన తక్‌పట్టి సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంఎస్‌పీ (మినిమం సపోర్ట్ ప్రైజ్) కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చీఫ్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన థర్డ్‌పార్టీ డేటా సెంటర్‌లో ప్రధాన నెట్‌వర్క్ అంతరాయంతో ఈనెల 9 నుంచి పత్తి సేకరణకు అంతరాయం కలిగింది. నెట్‌వర్క్‌ను పునరుద్ధరించిన వెంటనే పత్తి కొనుగోలును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లోకి పత్తి చివరిసారిగా వచ్చే వరకు కొనుగోలు చేస్తామని సీసీఐ రైతులకు హామీ ఇస్తోందని తెలిపారు.

# ఇంకెన్నాళ్లు.. ఎదురుచూపులు



» 2004లో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు » నిర్వహణ భారంతో 2008లో మూసివేత

» మూడేళ్ల క్రితం మళ్లీ మంజూరు చేసిన ప్రభుత్వం » ఇప్పటికీ ప్రారంభం కాని పరిస్థితి



వాలీబాల్ అకాడమీ కోసం ఏర్పాటు చేసిన కోర్టులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్ అకాడమీ పునఃప్రారంభం కోసం ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలంటూ క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ 2004లో మహబూబ్‌నగర్ జిల్లాకు వాలీబాల్ అకాడమీని మంజూరు చేసింది. నాలుగేళ్ల పాటు విజయవంతంగా కొనసాగిన ఈ అకాడమీలో శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. దీంతో మహబూబ్‌నగర్ వాలీబాల్ అకాడమీకి రాష్ట్రంలోనే మంచి గుర్తింపు లభించింది. కానీ నిధుల లేమి, నిర్వ హణా భారంతో 2008లో మూసివేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం అకాడమీని మళ్లీ ప్రారంభించాలని అప్పటి ప్రభుత్వానికి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పలుమార్లు విన్నవించారు. ఆ తర్వాత 2018లో రెండోసారి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. అప్పుడు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్న వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రిగా నియమితులయ్యారు. ఆయనను కూడా అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు అకాడమీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అకాడమీని మంజూరు చేసింది.

**2022లో క్రీడాకారుల ఎంపిక**

అకాడమీలో ప్రవేశాల కోసం 2022లో మహబూబ్‌నగర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన 20 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. అకాడమీలో చేరేందుకు పిలుపు వస్తుందని వారందరూ అప్పటినుంచి ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారులుగా ఏపీ. జితేందర్‌రెడ్డి, శాట్ చైర్మన్‌గా శివసేనారెడ్డి జిల్లాకు చెందిన వారు ఉండడంతో ఇప్పటికైనా వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, క్రీడాకారులు కోరుతున్నారు.

**వంట సామగ్రి, బెడ్లు సిద్ధం**

వాలీబాల్ అకాడమీకి అవసరమైన మౌలిక సామగ్రి కోసం గత ఏడాది చివర్లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (సాట్స్)కు ప్రతిపాదనలను పంపించింది. ఆ మేరకు రూ. 3.70 లక్షల విలువైన వంట సామగ్రి స్టేడియానికి చేరింది. రూ.3 లక్షల పైచిలుకు నిధులతో 40 ఇనుప మంచాలు వచ్చాయి. పరుపులు, దుప్పట్లతో పాటు, డైనింగ్ టేబుళ్లు రావాల్సి ఉంది. భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టు ఇచ్చే ప్రక్రియ పట్టాలెక్కాల్సి ఉంది. విద్యార్థులకు మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అందించే పౌష్టికాహారం తదితరాలకు కాంట్రాక్టర్ కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. బాల, బాలికలకు ప్రత్యేక కోచ్‌లను నియమించాల్సి ఉంది. అలాగే వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) రూ.19 లక్షల వరకు నిధులు విడుదల చేసింది. వాటితో మైదానంలో రెండు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. ప్లే ఫీల్డు గోడలకు చిత్రాలు కూడా వేశారు. క్రీడాకారులకు వసతి కల్పించేందుకు ఈత కొలను పైఅంతస్తులోని గదులను మరమ్మతు చేశారు. కానీ ఇప్పటికీ సాట్స్ నుంచి అకాడమీ ప్రారంభానికి సంకేతాలు లేకపోవడంతో ఎంపికైన క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు.

**అధికారుల దృష్టికి తీసుకెళ్తాం**



వాలీబాల్ అకాడమీ ప్రారంభం కాని విషయాన్ని సాట్స్ దృష్టికి తీసువెళ్లాం. ఇక్కడ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇద్దరు కోచ్‌లను నియమించాల్సి ఉంది. అలాగే ఇతర సదుపాయాలను కల్పించాల్సి ఉంది. సాట్స్ నుంచి అనుమతులు రాగానే క్రీడాకారులను ఎంపిక చేసి, అకాడమీని ప్రారంభిస్తాం.

\- ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌వో

**ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి**



జిల్లా కేంద్రంలో 2004లో వాలీబాల్ అకాడమీని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల పాటు ఎంతో మంది గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. ఎంతో మంది అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. కానీ 2008లో అది మూతపడింది. ప్రస్తుతం జి ల్లాకు చెందిన వారే రాష్ట్ర క్రీడా సలహాదారు, శాట్ చైర్మన్‌గా ఉండటంతో, అకాడ మీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

\- మహ్మద్ హనీఫ్, జిల్లా వాలీబాల్ సంఘం సెక్రటరీ



బోటులో షికారు చేస్తున్న చిన్నారులు

## పోటెత్తిన భక్తులు

» తిక్కవీరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

» అయిజలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

అయిజ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో కొలువైన తిక్కవీరేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు మంగళవారం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, రాయలసీమ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన బోటు షికారు, బ్రేక్ డ్యాన్స్, రంగుల రాట్నం తదితరాల వద్ద చిన్నారులు అధిక సంఖ్యలో కనిపించారు. గ్రామీణ మహిళలు పాటలు పాడుతూ, బొడ్డెమ్మ ఆడుతూ ఆనందంగా గడిపారు. ఆటవస్తువులు, తినుబండారాలు, మహిళల అలంకరణ సామగ్రి దుకాణాల వద్ద కొనుగోళ్లు జోరుగా కొనసాగాయి.



కోలాటం ఆడుతున్న చిన్నారులు

# కేజీబీవీల్లో ఆధిపత్యపోరు

» ఎస్‌వోలు, సీఆర్టీల మధ్య తరచూ వివాదాలు » ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) అధికారులు, సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. దీంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఇందుకు ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడమే కారణమని తెలుస్తోంది. పాలమూరు జిల్లాలోని పలు కేజీబీవీలలో స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్‌టీలు, సిబ్బంది మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. జిల్లాలోని 16 కేజీబీవీల్లో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఎస్‌వో చెప్తే మేము వినాలా, ఎస్‌వో గొప్పనా అంటూ కొందరు సీఆర్టీలు, కింది స్థాయి ఎదురు తిరుగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో నిత్యం ఏదో ఒక పాఠశాలలో అంతర్గత విబేధాలు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల ఎస్‌వోలు సర్దుకుపోతుండటంతో వివాదాలు బయటకు పొక్కడం లేదు. కానీ ఈ పరిస్థితుల్లో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి విధులకు, తరగతికి వెళ్లబోమని చెప్పడం, ఒక సీఆర్టీ సెలవులో ఉన్నప్పుడు వారి స్థానంలో క్లాస్ తీసుకోవాలని చెప్పడం తదితర సందర్భాల్లో గొడవలు జరుగుతున్నాయి. మొత్తంగా ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అన్నట్లుగా పరిస్థితి కొనసాగుతోంది.



రాజాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

**రాజాపూర్‌లో గొడవ**

రాజాపూర్ మండల పరిధిలోని కేజీబీవీలో సీఆర్టీలు విద్యార్థినులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఓ బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆమె తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలకు వెళ్లి ఎస్‌వో, సీఆర్టీలతో వాగ్వాదానికి దిగారు. కొంత కాలంగా అక్కడి ఎస్‌వో, కొందరు సీఆర్టీల మధ్య సమన్వయం లోపించింది. దీంతో ఇలాంటి వివాదాలు తలెత్తుతున్నట్లు విద్యార్థినులే చెప్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడమే కారణమని పేర్కొంటూ విద్యార్థి సంఘాల నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

**ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు**



కేజీబీవీలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు. ఎస్‌వోలు, సీఆర్టీలు గొడవలు పడినట్లు మా దృష్టికి వస్తే విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకుంటాం. రాజాపూర్ కేజీబీవీలో జరిగిన ఘటనపై విచారణ చేపట్టాలని ఎంఈవోను ఆదేశించాం. రిపోర్టు రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. - ఎ.ప్రవీణ్‌కుమార్, డీఈవో

## స్పౌజ్ బదిలీపై విచారణకు ఆదేశం

‘ఆంధ్రజ్యోతి’ కథనానికి స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం 18 (ఆంధ్రజ్యోతి) : స్పౌజ్ బదిలీలల్లో ఓ ఉపాధ్యాయురాలు తప్పుడు సమాచారం ఇచ్చి పోస్టింగ్ పొందిన ఘటనపై అధికారులు విచారణకు ఆదేశించారు. ‘స్పౌజ్ బదిలీల్లో తప్పుడు ధ్రువపత్రాలు’ శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారులు రమేశ్ కుమార్, ఎ.ప్రవీణ్‌కుమార్ స్పందించారు. ఉపాధ్యాయురాలు శ్వేత భర్త రాము జోగుళాంబ గద్వాల జిల్లా, పౌరసరాల శాఖలో పని చేస్తున్నారు కానీ ఆయన పాలమూరు జిల్లాలో పనిచేస్తున్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి, జీవో నెంబర్ 317 నిబంధనలకు విరుద్ధంగా మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండల పరిధిలోని ముచ్చింతలలో పోస్టింగ్ తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి వివరాలతో పాటు, సర్వీసు బుక్కులను రెండు జిల్లాల కార్యాలయాల్లో సమర్పించాలని ఆదేశించారు. మొత్తంగా ఈ వ్యవహారం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ విద్యాశాఖ, జోగుళాంబ గద్వాల జిల్లా పౌరసరఫరా శాఖ కార్యాలయాల్లో కలకలం రేపింది. దీనిపై మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్‌ను ‘ఆంధ్రజ్యోతి’ ఫోన్ ద్వారా సంప్రదించింది. నాగర్‌కర్నూల్ డీఈవోను అడిగి పూర్తి వివరాలు తెప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. .

## ఇన్‌చార్జి జీసీడీవో విధుల నుంచి తొలగింపు

» పాఠశాలకు వెళ్లాలని డీఈవో ఆదేశం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం 18 (ఆంధ్రజ్యోతి) : డిప్యుటేషన్‌పై ఇన్‌చార్జి జీసీడీవోగా పని చేస్తున్న రాధను విధుల నుంచి తొలగిస్తూ డీఈవో ప్రవీణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమ డిప్యుటేషన్‌పై గత కొన్ని రోజులుగా ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. ఉపాధ్యాయురాలు రాధను ఇన్‌చార్జి జీసీడీవో విధుల నుంచి తప్పించారు. పాఠశాలలో చేరాలని ఉత్తర్వులు ఇచ్చారు. పరీక్షల సమయం కనుక విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందని చెప్పారు. జీసీడీవోగా ఇంకా ఎవరికీ బాధ్యతలు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోకున్నట్లు చెప్పారు. కాగా కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాత్రం డీఈవోతో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. నెల్లన్నర క్రితం బాధ్యతలు ఇచ్చి, మధ్యలో ఎలా తొలగిస్తారని ప్రశ్నించినట్లు సమాచారం.

## ఫెన్సింగ్ పోటీల్లో హన్వాడ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన అంజలి, వర్షిణి, భువనేశ్వరి

హన్వాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఫెన్సింగ్ (ఖడ్గయుద్ధం) జాతీయ స్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మహాత్మా జ్యోతిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చాటారు. మూడు రోజుల క్రితం బిహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో నిర్వహించిన ఫెన్సింగ్ అండర్-19 పోటీల్లో విద్యార్థినులు శశికళ, అంజలి, వర్షిణి, భువనేశ్వరిలు పాల్గొని కాంస్య పథకాలు సాధించారు. వారిలో వర్షిణి జాతీయ స్థాయిలో 7వ ర్యాంక్ సాధించింది. త్వరలో నిర్వహించనున్న వ్యక్తిగత ట్రయల్స్ పోటీలకు వర్షిణి, భువనేశ్వరి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వందన తెలిపారు. వారిని ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి పాపిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

## కరాటేతో ఆత్మరక్షణ

» టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్



పతకాలు సాధించిన విద్యార్థులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కరాటేతో ఆత్మరక్షణ లభిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. నారాయణపేట పట్టణంలో సోమవారం నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మహబూబ్‌నగర్ కింగ్ షోటోకాన్ విద్యార్థులు మహ్మద్ హాజేఫ్, హఫ్సా, ఆయేషాబేగం, ఖిజ్రబేగం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో వినోద్‌కుమార్ వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రీ, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

**- ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి గూట విజయ్**

కందనూలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులను పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాఠశాల హెచ్‌ఎంను తక్షణమే సస్పెండ్ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ఇన్‌చార్జ్ గూట విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. అచ్చంపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈవో జీవన్ కుమార్ తోటి ఉపాధ్యాయురాలిపై కక్షపూరితంగా విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆమెను లైంగికంగా వేధిస్తూ మానసికంగా భయాందోళనకు గురిచేస్తున్న హెచ్‌ఎంను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. డీఈవో సమగ్ర విచారణ జరిపి వెంటనే అతన్ని సస్పెండ్ చేయాలని, లేనియెడల తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### నేడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 18, (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేడు పట్టణంలో నిర్వహించనున్నట్లు వేదిక సభ్యుడు శివచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి హైందవ సామ్రాజ్యాన్ని స్థాపించిన యోధుడు, భారతమాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీ అని అభిప్రాయపడ్డారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### 'కేంద్ర మంత్రులు క్షమాపణ చెప్పాలి'

వంగూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ కులంపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశాభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకొచ్చిన గాంధీ కుటుంబంపై బీజేపీ నాయకులు చేస్తున్న కుల, మత నీచ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ జైలుకు వెళ్లారని, దేశసమగ్రత కోసం ఇందిరాగాంధీ ప్రాణత్యాగం చేశారని, దేశం కోసం రాహుల్‌గాంధీ ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. రాహుల్ కులంపై చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### పాఠశాల ఆకస్మిక తనిఖీ

కోడేరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వడ్డెవాటలో ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి భాస్కర్ శర్మ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సంబంధించిన బోధన ప్రక్రియ వర్కుబుక్‌లో అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారా లేదా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు పెంచాలని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని సూచించారు. పరీక్షలు గడువు సమీపిస్తున్నందున విద్యార్థులకు సన్నద్ధం చేయాలని అన్నారు. సిలబస్ పూర్తి చేయడమే కాకుండా, వారికి అర్థమయ్యేరీతిలో బోధించాలన్నారు. ఎంఈవోతో పాటు సీఆర్పీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆసుపత్రిలో మంగళవారం పెబ్బేరు, ఆత్మకూరు రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ పరిమళ మాట్లాడారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో, కళాశాలలో ఇప్పటి వరకు 39 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 2050 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. వారిని రీ స్ర్కీనింగ్ కోసం మళ్లీ ఆసుపత్రికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కంటి సమస్యలున్న వారందరికీ ప్రభుత్వం ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తుందన్నారు.

### ప్రమాదకర చెట్టు తొలగింపు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులోని ఎండిన చెట్టును మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం తొలగింపజేశారు. వనపర్తి పట్టణం ఐబీ గెస్ట్ హౌస్ ప్రధాన రోడ్డు పక్కన సోమవారం ఎండిన చెట్టు కొమ్మ విరిగిపడి కారు ధ్వంసం కాగా టూ వీలర్ పాక్షికంగా దెబ్బతింది. ఈ స్థలాన్ని 22వ వార్డు నాయకుడు మెకానిక్ శ్రీను, 6వ వార్డు నాయకుడు గౌనికాడి యాదయ్య సందర్శించి ఘటన వివరాలను అక్కడి ప్రజలను, షాపు యజమానులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ ఆదేశంతో మునిసిపల్ సిబ్బంది వచ్చి మంగళవారం ఎండిన చెట్టును తొలగించారు. వహీద్, ఖాజా, శ్రీధర్ ఉన్నారు.

### కస్తూర్బా విద్యాలయం సందర్శన

పాన్‌గల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మండల ప్రత్యేక అధికారిని డీఆర్‌డీవో ఉమాదేవి మంగళవారం సందర్శించి, కూరగాయలను, భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు.

# పాదయాత్ర శివస్వాములకు అన్నదానం

బిజినేపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పాదయాత్రగా వస్తున్న శివ మాలధారణ స్వాములకు గౌతాపురం విజయలక్ష్మీనరసింహస్వామి ఆలయ పీఠాధిపతి హరిబాలానంద దాసు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, ఉమ్మడి జిల్లా నుంచి మహాశివ రాత్రి పర్వదినం రోజు శ్రీశైలం మల్లన్న దర్శనానికి పాదయాత్రగా వస్తున్న శివస్వాములకు అన్నదానం చేపట్టారు. 2012 నుంచి ప్రతీ ఏడాది అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్లు దాతలు చెన్నయ్య, శ్రీను తెలిపారు. ఈ నెల 22 వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, శేఖ ర్, కుమార్, సత్యం, బాలయ్య, లక్ష్యయ్య రఘు వీర్, సేవకులు జగదీష్, వెంకటేష్ ఉన్నారు.



మరికల్ గ్రామంలో భిక్ష చేస్తున్న శివస్వాములు

**వైద్య శిబిరం ఏర్పాటు**

మండలంలోని మంగనూర్‌లో దూర ప్రాంతాల నుంచి పాదయాత్రగా వస్తున్న శివమాలధారణ స్వాముల కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. వారికి ఓఆర్‌ఆర్ ప్యాకెట్లు, ఇతర మందులు అందజేశారు. వైద్య శిబిరంలో సిబ్బంది బాలమణి, జ్యోతి, శారద, కృష్ణవేణి, నాగమ్మ, అనిత, యువజన సంఘం సభ్యులు అశోక్, హాజీ, కృష్ణ ఉన్నారు.



వైద్య శిబిరంలో మందులు తీసుకుంటున్న స్వాములు

**శివస్వాముల ఇరుముడి**

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో శివస్వాముల జ్యోతిర్ముడి అన్నదాన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన శివస్వాములు, బంధు మిత్రులు మరికల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, శివభక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జనుంపల్లి రాఘవేందర్, బూశెట్టి కృష్ణమోహన్, మరికల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నక్క మహేష్ ఉన్నారు.

# శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**- జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్**




మేడిపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న షర్ఫుద్దీన్

తాడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మార్పులకనుగుణంగా విద్యార్థులు తప్పనిసరిగా ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముం దుకెళ్లాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వ ర్యంలో రాష్ట్ర స్థాయి ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి అందులో వారు ప్రసంగించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఎంపికైన ముగ్గురు విద్యార్థినులకు రాష్ట్రస్థాయిలో మేడిపూర్ పాఠశాలలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా పాల్గొనే విధంగా దృఢసంకల్పంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం త్యాగరాజుగౌడ్, ఎఫ్‌పీఎఫ్‌టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కృష్ణారెడ్డి, చైతన్య, బాలయ్య, రమేష్, శివకుమార్, శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దైవచింతనతో సత్ప్రవర్తన అలవడుతుంది

**- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి - ప్రారంభమైన మడేలు మాతేశ్వర సీతమ్మ బ్రహ్మోత్సవాలు - భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం**



మాట్లాడుతున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : దైవచింతనతో మనిషిలో సత్ప్రవర్తన అలవడుతుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి అన్నారు. పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని కైలాసం గుట్ట సమీపంలో వెలిసిన శ్రీమడేల మాతేశ్వర సీతమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం శివపార్వతుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచారి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు ఆచారిని పూల మాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడడంలో ప్రతీ ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, నాయకులు విజయ్, బాబీదేవ్, పర్వతాలు, రజక సంఘం నాయకులు శ్రీనివాస్, అంజయ్య, మడేలు, బాలు, జంగయ్య తదితరులు ఉన్నారు.

# గిరిజన డిగ్రీ కళాశాలను అచ్చంపేటకు తేవాలి

**- గిరిజన సంఘం నాయకుడు చత్రునాయక్**



ఎమ్మెల్యేను కలిసిన గిరిజన సంఘం నాయకులు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటకు కేటాయించిన గిరిజన డిగ్రీ కళాశాల జడ్చర్లలో ఉందని, ఆ కళాశాలను అచ్చంపేటకు తీసుకురావాలని గిరిజన సంఘం నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను కోరారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందించారు. నల్లమల ప్రాంతంలో ఉన్న గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇబ్బందులు పడుతున్నారని, జడ్చర్లలో ఉన్న గిరిజన డిగ్రీ కళాశాలను అచ్చంపేటకు తీసుకువస్తే గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య సులభతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు శ్రీను నాయక్, వినోద్ కుమార్, నరసింహ, శక్రు, భరత్, బలరాం, దశరథం, రమేష్ పాల్గొన్నారు.

# కళ్లకు గంతలతో నిర్వాసితుల నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

చారకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బైపాస్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల రిలే దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరాయి. నిర్వాసితులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు చిలుక బాల్‌రెడ్డి నిర్వాసితుల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారికి న్యాయం జరిగే వారకు ఆందోళన విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, పరశురాములు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై బీఆర్‌ఎస్ కపట ప్రేమ

**- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్**

కల్వకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులపై బీఆర్‌ఎస్ పార్టీ కపట ప్రేమ ప్రదర్శిస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో లక్షలోపు రుణమాఫీ దారులకు రూ.25వేల చొప్పున నాలుగు సార్లు మాఫీ చేసినా రైతులందరికీ పూర్తిగా చేయలేదని ఆయన ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేసిందని ఆయన పేర్కొన్నారు. ఒకే కుటుంబం రేషన్‌కార్డులో రెండు, మూడు అకౌంట్లపై రెండు లక్షలకు పైగా ఉన్న కొంతమందికి టెక్నికల్ సమస్య వల్ల రుణమాఫీ కాలేదని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆమనగల్‌లో నిర్వహించిన రైతు దీక్షతో రైతులను మభ్యపెట్టడమేనని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ప్రతిపక్ష పార్టీల నాయకులను రైతులు ఎవరూ నమ్మరాదని ఆయన పేర్కొన్నారు.

### కేటీఆర్ మీటింగ్‌కు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

తాడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు కేటీఆర్ నిర్వహించిన రైతు దీక్షకు మద్దతుగా మంగళవారం బయల్దేరి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, సమద్‌పాష, బొడ్డుపల్లి రమణ, తిరుపతిరెడ్డి, రమేష్‌రెడ్డి, పర్వతాలు, మశన్న, అనిల్‌రెడ్డి, రాజుగౌడ్, జలీల్, ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### కల్వకుర్తి నుంచి..

కల్వకుర్తి : కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్‌లో నిర్వహించే రైతు దీక్షకు కల్వకుర్తి నుండి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. రైతు దీక్షకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కాగా మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు, రైతులు భారీ ఎత్తున ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లారు. బయల్దేరి వెళ్లిన వారిలో కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల నాయకులు, పార్టీ శ్రేణులు ఉన్నారు.

### మోతాదుకు మించి ఎరువులు వాడరాదు

**- మండల వ్యవసాయ అధికారి నర్మద**



వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి నర్మద

తెలకపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంటలకు యూరి యాను మోతాదుకు మించి వాడకూడదని మండల వ్య వసాయ అధికారి నర్మద అ న్నారు. మండలంలోని రా కొండ, లక్నారం, పెద్దూరు గ్రామాల్లో మంగళవారం వరి, మొక్కజొన్న పంట పొలా లను ఆమె పరిశీలించి రైతులు యూరియాను మోతాదుకు మించి వాడుతున్నారని తెలిపారు. వరి నాటిని 45-55 రోజులకు ఎకరాకు 15 నుంచి 20కిలోల వరకు పొటాష్‌ను 20 కేజీల యూరియాను కలిపి వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతీ మంగళవారం పెద్దూరు గ్రామ రైతు వేదికలో ప్రముఖ వ్యవ సాయ నిపుణుల ద్వారా వివిధ పంటలు, సాగు విధానాలు యాంత్రీకరణ మొదలగు విషయా లపై జరిగే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. వ్యవసాయ అధికారితో పాటు విస్తరణాధికారి శ్రావ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే నాకు ఆత్మీయులు

**- బిజినేపల్లి మండల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

కందనూలు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే నాకు ఆత్మీయులు అని, వారే పార్టీకి బలమని స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి బిజినేపల్లి మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలో మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్య క్రమానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సైనికు డిలా పని చేశారని, గత ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఎంత ప్రలోభ పెట్టినా, ఇబ్బందులకు గురిచేసినా, కేసులు పెట్టినా ధైర్యం, విశ్వాసంతో ముందుండి పార్టీని గెలిపించారన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త కుటుం బానికి అండగా ఉంటామన్నారు. అలాగే రైతురుణమాఫీలో భాగంగా ఒక్క బిజినేపల్లి మండలానికి రూ.60 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే**

తాడూరు : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతీ నిరుపేద కుటుం బానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుట్టలపల్లి గ్రామంలో లబ్ధిదారునికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో మొట్టమొదటగా తాడూరు మండలంలోని గుట్టలపల్లి గ్రామంలో మొట్ట మొదటి ఇల్లు నిర్మాణం కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఇల్లు లేని ప్రతీ కుటుంబానికి అండగా నిలిచి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే విధంగా ముందుకెళ్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ దశల వారీగా పూర్తి చేసి ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. అనంతరం తాడూరులో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వల్లపురెడ్డి, చిన్నపురెడ్డి, నంద మల్లయ్య, చంటి, నరేందర్‌రెడ్డి, కొత్తపల్లి వెంకటయ్య, వినోద్ కుమార్, మల్లేష్, ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తకోట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాలికల శిశు సంరక్షణ ఆత్మకూర్ ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని పామాపురంలోని అంగన్‌వాడీల్లోని చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణి, బాలింతకు పోషక ఆహార పదార్థాలు అందించాలని ఆదేశించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సబితా, టీచర్లు శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించాలి



మునిసిపల్ సిబ్బందికి మందులు పంపిణీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్

**- మునిసిపల్ కమిషనర్ మహమ్మద్**

కల్వకుర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలని ము నిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ కోరారు. కల్వకుర్తి పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందికి మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వైద్యులు పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన మందులను మునిసిపల్ కమిషనర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో భీమానాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

# పరిశోధించాడు.. పట్టాపొందాడు

**నాగర్‌కర్నూల్ డీటీవోకు డాక్టరేట్ - ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా పొందిన చిన్నబాలు నాయక్**



డాక్టరేట్ పట్టా పొందిన చిన్నబాలునాయక్ (ఫైల్)

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బొగ్గు ఆధారిత యాష్ ప్రభావంపై చేసిన పరిశోధనలకు జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎల్. చిన్నబాలునాయక్ డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బొగ్గు ఆధారితపై యాష్ వైవిధ్యమైన ప్రభావంపై పరిశోధనలు జరిపి మెటల్ మ్యాట్రిక్స్ మిశ్రమ పదార్థం కోసం ప్రొఫెసర్ ఆర్.రాజేంద్ర పర్యవేక్షణలో డిస్క్ బ్రేక్ పనితీరుపై చిన్నబాలునాయక్ ప్రయోగాలు చేశారు. సూర్యాపేట జిల్లాలోని మారుమూల ప్రాంతమైన యతిరా జాతండాకు చెందిన చిన్నబాలు నాయక్ మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ ఇన్ ప్రొడక్షన్ టెక్నాలజీ స్పెష లైజేషన్ ఉస్మానియా యూనివర్సిటలో చదివారు. మొదట తమిళనాడులోని మైనింగ్ శాఖలో నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సీఎల్), వైజాగ్ స్టీల్ ప్లాంట్ జూనియర్ మేనేజర్‌గా ప్రమోషన్ పొంది ఆ తర్వాత ఏపీపీఎస్సీ నిర్వహిం చిన అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. అక్కడి నుంచి ఆయన బదిలీపై ప్రమోషన్ పొంది డిస్ట్రిక్ట్ ట్రాన్స్ పోర్టు ఆఫీసర్‌గా విధులు నిర్వ హిస్తున్నారు. చదువుపై ఆసక్తితో ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఆర్.రాజేంద్ర పర్యవేక్షణలో మెటల్ మ్యా ట్రిక్స్ కోసం మిశ్రమ పదార్థం కోసం జరిగిన పర్య వేక్షణలో డిస్క్ బ్రేక్ పనితీరుపై జరిపిన ప్రయోగాత్మక ప్రక్రియలో పరిశోధనలు జరిపి డాక్టరేట్ పట్టాపొందడం విశేషం. డాక్టరేట్ పొందడం పట్ల చిన్నబాలునాయక్ మీడియాతో మా ట్లాడుతూ ఇది తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా ఎవ రైనా సరే విద్యను నిర్లక్ష్యం చేయకుండా అన్ని పరిస్థితులను తమకు అనువుగా మలుచుకుని ముందడుగు వేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# కస్తూర్బాలో స్వపరిపాలన దినోత్సవం



తాడూరు కస్తూర్బాలో ఉపాధ్యాయులైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

తాడూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలు బోధించారు వివిధ సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలను నల్ల బల్లాలపై వివరిస్తూ బోధించడం అబ్బురపరిచింది. ఎలాంటి బెరుకు, భయం లేకుండా విద్యార్థులు బోధించారు. ఎస్‌వో విజయ ఆధ్వర్యంలో 25మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. చక్కగా బోధించిన వారికి బహుమతులు అందజేశారు. అభినందించారు. కేజీబీవీలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.